సినీవాలీ

వరద గోదావరిలా పరుగెడుతోంది గోదావరి.

పట్టీపట్టని నిద్రలోంచి టైంచూసాడు అప్పారావు. నాలుగు! కిందకి చూసాడు. వసీమ్‌కూడా నిద్రలేచినట్టున్నాడు. ఆవులిస్తున్నాడు.

"గుడ్ మార్నింగ్!"

"గుడ్ మార్నింగ్! నిద్రపట్టలేదా?"

"ఏం నిద్రండీ! ఒకటే కుదుపు. సౌండు! ఆ గురూని చూడండి! హాయిగా కుంభకర్ణుడిలా గుర్రు కొడుతున్నాడు... రైల్లో పడుకోటం ఓ పెద్ద ఆర్టను కుంటాను...."

వసీమ్ లేచి కూర్చున్నాడు. మధ్య బెర్తుని గొలుసుల్నించి తప్పించేసారు. బాగ్‌లోంచి కొత్త బ్రష్షూ పేస్టూ తీసుకున్నాడు అప్పారావు. వాటి కొత్తదనంచూసి తనకు అలవాటు లేదని కనిపెట్టేస్తాడని తువ్వాల్లో దాచేసి గబగబ నడిచాడు.

అప్పారావు బాత్రూం పూర్తి చేసుకు వచ్చేసరికి వసీమ్ ఓ రుమాలుని పరీక్షగా చూస్తున్నాడు. "-ఇది మీదేలా వుంది...." అంటూనేవున్నాడు. అప్పారావు లాక్కుంటున్నట్టుగా తీసుకున్నాడు. పారేసుకున్న అమూల్యవస్తువు దొరికించుకున్న ఫీలింగు. చిరుసిగ్గు.

"ఏంటి సార్! అంత షరమైపోతున్నారు! ఏమైనా లవ్ స్టోరీయా..!"

బండెక్కే వరకూ ముక్కూమొహం తెలీని మనిషి ఒక్కమారుగా అలా అడిగేసరికి సిగ్గుసిగ్గయిపోయాడు అప్పారావు.

"ఒహోయిన స్టేషన్‌కి రావాలన్నాను గదా! వాళ్ళమ్మాయి లీల....! ఒక్కత్తే అమ్మాయి....! చిన్నప్పట్నించీ తెలుసు....! ప్రెజంట్ చేదామని మా చెల్లిచేత కుట్టించాను"

హుషారుగా నవ్వాడు వసీమ్.

"నిఖా అయిపోయిందా?"

"అంటే...!!?"

"అదే .... పెళ్ళి సెటిలయిందా?"

అప్పారావుమొహంలో మార్పుస్పష్టంగా కనిపిస్తోంది.

"ఇంకా లేదండిగురుగారూ...! ఇప్పుడు తెలిపోతుంది...."

అమాయకంగా వుంది ఆ మొహం. ఇరవయ్యేళ్ళ లేతదనాన్ని రెండేళ్ళ నిరుద్యోగ రాక్షసి ఫలహారిస్తున్న గుర్తులు.

వసీమ్‌ది కాస్త సునిశితబుద్ధి. ఇద్దరిదీ ఒక్కటే యీడు. ఒకటే బాచ్. పోతే అతనిది విశాఖ పోలిటెక్నిక్. అప్పారావుది శ్రీకాకుళం. వసీమ్ విద్యుత్ బోర్డ్‌లో యన్నెమ్మార్. అప్పారావు పల్లెటూళ్ళో తండ్రితోబాటు వుంటున్నాడు. ఈ వివరాలన్నీ ముందే చెప్పుకోవటంవల్ల అప్పారావు కాంప్లెక్స్ కొంత గ్రహించాడు.

"-మా బాబా చెప్తాడు! బేటా! అల్లాని నమ్మిన వాళ్ళకి అన్నీ ఆయనే చూసుకుంటాడు."

అప్పారావుకి నమ్మిక కుదిరినట్టు లేదు. గట్టిగా నిట్టూర్చాడు. బట్టలు మార్చుకున్నాడు. రుమాలుని భద్రంచేసాడు. వసీం తన కాలకృత్యాలు పూర్తిచేసుకు వచ్చేదాక ఆలోచన్లమీద ఆలోచన్లు...

'-లీల ఎలా వుంటుంది...?' అన్న ఆలోచనకన్న 'లీలతండ్రి ఎలా వుంటాడు' అన్న ఆలోచనే ఎక్కువగా వుంది. ఓ చిన్ని రుమాలు తనవేపు ఆ పిల్లను ఆకర్షించగలదా? ఆ రుమాల్లో .... తన హృదయాన్ని చూడగలదా? నిజంగా చూడగలిగితే - అందులో తన ప్రేమ కనిపిస్తుందా - తన అవసరం కనిపిస్తుందా-

అప్పారావుకంతా గాభరాగా దుఃఖంగా మోసంగా వ్యర్థంగా....

"ఏంటి భాయ్! అంత గాఢంగా ఆలోచిస్తున్నారు....?"

బలవంతపు నవ్వు నవ్వాడు అప్పారావు.

వసీమ్ తన బెడ్డింగ్‌లోంచి తీసి, వేసుకుంటున్న దుస్తులవయిపు చూస్తూ వుండిపోయాడు. వాటిని షేర్వాణీ చుడీదార్ పైజామా అంటారని అతనికి తెలీదు. ఆ దుస్తులు వసీమ్ స్వంతంలా అనిపించలేదు అప్పారావుకి.

"-ఎలా ఉన్నానూ....?"

"ఆ మధ్యనే చూసిన పాత ఉర్దూ సిన్మాలా ఉన్నారు..."

"అయితే ఫర్లేదు" మా బాబా చెప్పాడు బేటా' బషీర్‌సాబ్‌కి సంప్రదాయం ఇష్టం. ఆయన నిన్ను మెచ్చుకున్నాడా - నీరొట్టి విరిగి నేతిలో పడ్డట్టే-"

"మనమిద్దరం ఇలా కలవటం, మాట్లాడుకోటం.... ఇదంతా చూస్తుంటే మన ఇద్దరికీ యింటర్వ్యూలో సెలక్షన్ వస్తుందని... నా సిక్స్‌సెన్స్ చెబుతోంది. వసీం!"

వసీం టోపి సర్దుకుని అతని పక్కనే చతికిలబడ్డాడు

"అప్పారావుగారూ! మీది చాలా మంచిమనసు..."

"అయ్యబాబోయ్! ఈ కాస్సేపట్లోనే కనిపెట్టేశారే...!"

"మా బాబా చెప్తాడు... బేటా! మంచిమనసున్న దోస్తుకి మించిన అదృష్టం లేదూ...."

"మీ బాబా బాగా చదువుకున్నారా?"

"ఉహూఁ! షిప్‌యార్డ్‌లో ఫైర్‌మాన్! ఆయన అంటారు - బేటా! ఉద్యోగం కోసం చదివే చదువ్వల్ల ఏమీ తెలీదు! అల్లాని నమ్మి అందరికీ ఉపకారంగా వుండే చదువు చదువుకో! అన్నీ అవే తెలుస్తాయి..."

"ఎప్పుడయినా విశాఖపట్నం వచ్చి మీ నాన్నగార్ని కలుసుకోవాలి...."

"తప్పకుండా..."

ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

తోటి ప్రయాణీకులు ఒకరూ ఒకరూ లేస్తున్నారు. పక్కలు సర్దుకుంటున్నారు. రాత్రంతా గుర్రుకొట్టిన భారీమనిషి లేవక తప్పదన్నట్టు లేచివచ్చి కూర్చున్నాడు.

"-అబ్బాయ్! స్టేషన్ వస్తుంది! కాఫీవాడినీ పేపర్ వాడినీ పిలువ్!" అనేసి జవాబుకోసం చూడకుండా వెనక్కిజారబడి కళ్ళు మూసుకున్నాడు.

అసలెందుకు లేచాడో - లేచి మళ్ళీ ఏం చేస్తున్నాడో - చూస్తుంటే మిత్రులకి నవ్వు వచ్చింది. లావుశరీరంమీద ఓ జోకు చెప్పాడు వసీం. అప్పారావుకి నవ్వాగలేదు. వసీం జడిసినట్టు భారీమనిషికి నిద్రాభంగం అవలేదు.

గోదావరి సికిందరాబాద్‌లో ఆగింది.

దిగేవాళ్ళు దిగుతున్నారు. ఎదురొచ్చే వాళ్ళు పల్చగావున్నారు. కూలీలు సామాన్లతో వెయిటింగ్‌రూంలవైపు నడుస్తున్నారు.

కబుర్లలో వున్న మిత్రులమధ్య కాఫీ వెండర్ బాంబ్ పేల్చాడు.

"-తెలవదా సాబ్! రాత్‌సే కర్ఫ్యూ సాబ్! పేపరు జర లేటొస్తది...."

భారీప్రాణి కాఫీతాగుతూ పేపరులేదన్న చిరాకుతో విసుగ్గాచూసాడు - "ఎప్పటిదాకా కర్ఫ్యూ...?"

"తెలువదూ సాబ్! నౌబజేకో లిఫ్ట్ చెయ్యొచ్చుసాబ్!"

అతను డబ్బులు తీసుకుని వెళ్ళేదాకా ఇద్దరూమాట్లాడలేదు బితుకుబితుకుమంటూ భారీమనిషివైపు చూసాడు వసీమ్.

"కర్ఫ్యూ అంటే ఏంటి సార్?"

అతను పళ్ళన్నీ బయటపడేలానవ్వుతూ-

"బయటకెళ్లు! తెలుస్తుంది! కాల్చిపారేస్తారు..."

"ఎందుకూ....?" వణుకుతున్న గొంతుతో అన్నాడు అప్పారావు.

"కాల్చేముందు.... ఏదీ .... కాల్చేసే ముందు అడుగు! చెపుతార్లే!"

భారీమనిషి మళ్ళీ కళ్ళుమూసుకున్నాడు. చేతిలో పవర్‌లేదుగాని, వుంటే ఫైర్ అంటూ అరవటానికి సిద్ధంగావున్న రాజకీయ నాయకుడిలా వున్నాడు.

కుర్రాళ్ళిద్దరూ బిక్కచచ్చిపోయారు.

"నన్ను చూసి కోపం వచ్చిందంటూరా" తన దుస్తులకేసి చూపిస్తూ చెవిలో చెప్పినట్టు అన్నాడు వసీం.

"ఏమో!" అన్నట్టు పెదవి విరిచాడు అప్పారావు.

నాంపల్లిలో ఆగింది గోదావరి.

భారీమనిషి తాపీగా తన సామాన్లు సర్దుకుంటున్నాడు. అతన్ని తప్పించుకోవాలన్నట్టు యిద్దరూ గబగబా ప్లాట్‌ఫారం మీదకు దిగారు. బిక్కముహాలతో నిలబడ్డారు. వాళ్ళకోసం ఎవరూ రాలేదు.

ఎనిమిదయిదాకా ప్లాట్ ఫారం మీదే వున్నారు. తరువాత నెమ్మదిగాకదిలి స్టేషన్ ముందుకివచ్చారు. ఎక్కడ చూసినా జనం. కర్ఫ్యూ పాసులు తెచ్చుకోగలిగిన కొన్ని కార్లువచ్చి తమవాళ్ళని వేసుకుని వెళ్ళిపోతున్నాయి. ఎదురుగా కనిపిస్తున్న హైదరాబాద్‌వీధి నిర్మానుష్యంగా వుంది. కొందరు జవాన్లు చేతిలోతుపాకీలతో అక్కడక్కడ కనిపిస్తున్నారు.

ప్రయాణీకుల్లో కొందరు కాంటీన్లో వున్నారు. స్థానికుల తెలుగు యాస కొందరికి అర్థంకావటంలేదు. ఎక్కడ చూసినా కర్ఫ్యూ కబుర్లే! అంతమందిలో పలకరించటానికి, కర్తవ్యంగూర్చి సలహా తీసుకోటానికీ నమ్మదగ్గ మొహమే కనిపించటం లేదు వసీమ్‌అప్పారావులకి. ఒకరితోఒకరు మాట్లాడుకోటానికి కూడా అర్థంలేని భయం అడ్డుపడుతున్నట్టుంది.

"సాయంకాలం దాకా యిక్కడేవుండి - మళ్ళీ గోదావరి ఎక్కేస్తే బెటర్లాగుంది-" అన్నాడు అప్పారావు.

"యింతదూరం వచ్చాం! ఇంటర్వ్యూకి అటెండవకుండానా...?" వసీమ్ సందేహంగా.

ఇంతట్లో ఓ వాన్ కొందరు జర్నలిస్టులతో వచ్చి స్టేషన్‌ముందు ఆగింది! ఫోటో గ్రాఫర్ల ఫ్లాష్‌లక్లిక్ మంటున్నాయి! హఠాత్తుగా ఎదురయిన కర్ఫ్యూ అనుభవంమీదా, మతసామరస్యానికి పరిష్కార మార్గాలమీదా, మతకలహాలకు కారణాల మీద, విలేఖర్లు ప్రశ్నలువేస్తూ జవాబులు రికార్డ్ చేసుకుంటున్నారు.

ఓ విలేఖరి ఉర్దూలో ఏదో అన్నాడు. వసీమ్ జవాబీయలేకపోయాడు. వెంటనే తెలుగులోకి దిగిపోయాడు.

"హిందూ ముస్లిమ్ గొడవలు జరుగుతున్న ఈ టైంలో ఈ డ్రస్‌లో మీ ఫీలింగ్స్ ఏమిటి?"

అతని చేతిలోని మౌత్‌పీస్‌ని కంగారుగా చూస్తూ- "అంటే....!"

అతను సన్నగానవ్వి - "మీ ఐడెంటిటీ తెల్సిపోతూంది గదా! సెక్యూరుడ్‌గా ఫీలవుతున్నారా...?"

"ఏమోసార్! అంతాగాభరాగా వుంది. ఈ కర్ఫ్యూ ఎంతవరకూ ఉంటుందండీ?"

జవాబు రాబట్టేలా ప్రశ్న వేయటం నేర్చుకోవాల్సిన విలేఖరి జవాబీయలేనివాణ్ణి కలుసుకున్నట్టు మొహం పెట్టాడు.

"ఎవరూ చెప్పలేదా? తొమ్మిది నుంచి పదకొండుదాకా లిఫ్ట్ చేస్తారు...." మరే జవాబూ యివ్వరాదన్నట్టు గబగబా కదిలిపోయాడు.

మిత్రులు కొంచెం రిలీఫ్ ఫీలయారు.

టైం 8-15

"ఆ సమయంలో మనవాళ్ళు వస్తారంటారా వసీం!"

"చూద్దాం! ముందు కాస్త టిఫిన్ తిందాం పదండి.

టిఫిన్ పళ్ళాలతో ఓ బల్లముందు సెటిలయారు.

"- వీళ్ళు రాకపోతే-" అన్నాడు అప్పారావు మధ్యలో.

వసీం టిఫిన్ పూర్తయిదాకా మాట్లాడలేదు.

"కంగారుపడకండి అప్పారావుగారూ! ఒకరికి యిద్దరం ఉన్నాం! ఏదయినాకలిసే చేద్దాం! ఆలోచిద్దాం! ఇంతదూరం వచ్చాం! ఇంటర్వ్యూ మిస్సవడం తెలివైన పనికాదు."

తన భయం బహిరంగమయిపోయిందన్న కించ అప్పారావుకి కలగలేదు. తన కంగారు ఓ. సరయిన వ్యక్తికి తెలిస్తే అతనే అన్నీ సరిచేస్తాడన్న ఫీలింగ్ కలిగింది.

"పేపరు వచ్చినట్టుంది - ఓ కాపి తెస్తాను..." వెళ్ళి తెచ్చాడు అప్పారావు.

కర్ఫ్యూవిశేషాలు ప్రముఖంగా ప్రచురించింది దినపత్రిక. నగరమంతటా కర్ఫ్యూ లేదు. సికిందరాబాద్‌లోకూడా చాలా ప్రాంతాలు కర్ఫ్యూలోవున్నా ఆల్వాల్‌లో లేదు. కర్ఫ్యూలేని కొన్ని ప్రాంతాల్లోకూడా కత్తిపోటు సంఘటనలు జరగటంతో నగరమంతటా కర్ఫ్యూ విస్తరించే అవకాశంవుంది. ఉదయం 9-11 గంటల మధ్య కర్ఫ్యూ సడలించారు.

పేపరు మడిచాడు అప్పారావు.

"ఆల్వాల్‌లో కర్ఫ్యూ లేదట...." అన్నాడు వసీం ఆలోచనగా.

"........."

"మనమంటే ఈవేళేవచ్చేసాం! చాలా మంది రేపుగాని రారు! ఈ కర్ఫ్యూ గొడవ పేపర్లో చూస్తే ఒక్కడు బయల్దేరడు-మనం ఇంటర్వ్యూకి అటెండయితే - చాలా ఛాన్సు వుంటుంది...." అన్నాడు వసీం మళ్ళీ.

అప్పారావుకి ఆ తర్కం నచ్చలేదు. పల్లెటూళ్ళో ఉంటూండటంవల్ల మరింత గాభరా అయిపోయాడు. బతికుంటే బలుసాకు ఏరుకు తినొచ్చుననిపిస్తోంది అతనికి.

"వీళ్ళు రాకపోతే - ఈ రోజంతా ఎక్కడ గడుపుదాం?"

"లాడ్జిలో....?!"

"లాడ్జిలోనే...."

"ఏముందీ.... ఒక్కరాత్రి. మళ్ళీరేపు యిదే టయింకి కర్ఫ్యూ సడలిస్తారనుకుంటాను! ఏదోలా ఇంటర్వ్యూకి వెళ్దాం. మన అదృష్టం బాగుందా - ఇంటర్వ్యూలో మనమే ఉంటాం - అక్కడ నుంచే డైరెక్టుగా స్టేషన్‌కి వచ్చేద్దాం! రేపు సాయంకాలం గోదావరిలో మనవూళ్ళకి బయల్దేరిపోతాం!...." వసీం మాటలూ ఆలోచనలూ ఆశావహంగా వున్నా అసంబద్ధంగా అవుపిస్తున్నాయి అప్పారావుకి.

"కర్ఫ్యూ ఎత్తకపోతే? కర్ఫ్యూ పేరు చెప్పి ఇంటర్వ్యూ చెయ్యకపోతే?"

వసీంకి జవాబు తోచలేదు.

"అప్పారావుగారూ! మా బాబా చెప్తాడు- అన్నింటికీ అల్లా వున్నాడూ...."

ఏమయినా అప్పారావుకి నచ్చలేదు. రకరకాల ప్రశ్నలు వేసాడు. వసీం నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు. ఆఫీస్ వుంటుందా? ఇంటర్వ్యూ చేస్తారా? ఇంతకు ముందే ఆ ఖాళీలు భర్తీఅయిపోయివుండవా? ఇవి కళ్ళుతుడుపు ఇంటర్వ్యూలుకావా....?

చిట్టచివరికి అసలు సందేహం బయటపెట్టాడు అప్పారావు.

వసీం స్నేహంగా నవ్వాడు.

"అప్పారావుగారూ! నా దగ్గరకూడా లాడ్జీకీ ఆటోలకీ ఖర్చు పెట్టేంత డబ్బుల్లేవుగాని... సర్దుకుంటే ఆ మాత్రం సరిపోకపోవు! అంతగా మీరు మొహమాటపడితే మీకు వీలయినపుడు పంపుదురుగాని...."

అప్పారావు కళ్ళు తడిదేరాయి.

నిన్నటిదాకా అతనెవరోతెలీదు. ఈరోజు అతన్నించి అంత స్నేహపూరితమయిన మాట....! అతని ఊహకే అందదది.

పదయిందాకా వాళ్ళు బంధువుల కోసం చూసారు.

జనం ఆటోలలోనూ టాక్సీలలోనూ కదిలిపోయారు. సిటీబస్సులులేవు. ఇద్దరూ రోడ్డుమీదకివచ్చి ఓ లాడ్జిలో రూం తీసుకున్నారు.

ఇద్దరూ కలిసి డబ్బులు లెక్కవేసారు. భోజనానికి సరిపోయేట్టు కనిపించలేదు. రాత్రికి తిందామనుకున్నారు. రొట్టెలుతెచ్చుకున్నారు.

పదకొండవుతోంది.

జవాన్లు జనాన్ని అదుపుచేయటం మొదలెట్టారు.

కిటికీ ఊచల్లోంచి కనిపిస్తున్న నాంపల్లి - బిడ్డల్ని కొట్టులోపెట్టి మానభంగం చేయబడుతున్న తల్లిలా-వుంది.

జనసంచారంలేని నగరం విధవరాలిలా వుంది.

ఖాళీరోడ్లమీద తిరుగుతున్న జవాన్లు ఆమె కారుస్తున్న కన్నీటిధారల్లా వున్నారు.

మిత్రులిద్దరూ రొట్టెతిని మంచినీళ్ళు తాగి పడుకున్నారు.

రాత్రంతా లేని నిద్ర కళ్ళమీదకు కాపురానికి వచ్చింది.

ప్రపంచం యింకా ట్రైన్లో ఊగుతున్నట్లేవుంది. ఆకస్మాత్తుగా అప్పారావుకి మెలకువ వచ్చింది.

లీలను పెళ్ళాడతానన్నాట్ట! తుపాకీ పుచ్చుకుని వెంటబడిన కలలోని లీల తండ్రి ఎదురుగా కనిపించలేదు. తుపాకీ చప్పుడు వినిపించలేదు. ఇంకా గుండెదడ తగ్గలేదు. అప్పారావు ఆ పట్టపగలు ఏకాంతంలో కాల్తొన్నకడుపులో కాసిన్ని మంచి నీళ్ళు చేర్చాడు. తిరిగివచ్చి, వసీమ్ పక్కనే పడుకున్నాడు. నిద్దట్లో అతనికి దగ్గరగా జరిగి చేయివేస్తాడు.

ముక్క కంపు కొడుతున్న ఆ గది మునగదీసుకుంది.

2

ఆ రోజు తొమ్మిదినుండి మూడువరకూ కర్ఫ్యూ సడలించారు.

మిత్రులిద్దరూ లాడ్జి ఖాళీ చేసారు. ఆటోలో ఆల్వాల్ వయిపు కదిలారు. అంతగా జనసమ్మర్దంలేని వీధులూ, అడపాదడపా కనిపించే గస్తీవాహనాలూ, విశాలమయిన ఉస్మాన్‌సాగర్ చెరువుగట్టూ, అందుమీంచి కనిపిస్తున్న నీటిని తాగుతున్న నగరం.

ఆటో వాళ్ళని విడిచి ముందుకుసాగింది.

సెక్యూరిటీ ఆఫీసర్‌వాళ్ళ ఇంటర్వ్యూ కాగితాలు తనిఖీచేసాడు. వాళ్ళ సామాను పెట్టుకోడానికి స్థలంచూపాడు, ఓ మనిషిని యిచ్చి లోపలకు పంపాడు.

విశాలమయిన హాలు, సోఫాలు. అప్పటికే మరో ఆరుగురు వున్నారు. యింత సాహసంచేసి తాముతప్ప మరెవరూ హాజరవరనుకున్న వసీం మోహం చిన్నబోయింది. వాళ్ళలో నలుగురు ఓచోట చేరి ఏవోకబుర్లు చెప్పుకుంటున్నారు. చూస్తుంటే వాళ్ళు ఒకే పాలిటెక్నిక్ వాళ్ళు అనిపిస్తోంది. అంటే ఈమధ్యనే

పాసయినవాళ్ళు. సబ్జక్ట్‌తో యింకా బాగా పరి యంపున వాళ్ళు. వసీం ఆలోచనలు రకరకాలుగా సాగుతున్నాయి.

రాత్రంతా అప్పారావు పుస్తకాలముందే వున్నాడు. వసీమ్‌ని లేపుతూ వుండేవాడు. అతను ఇంటర్వ్యూలకూ చదువులకూ సంబంధంలేదని వాదించే మనిషి. పైగా అప్పారావుకి అదే మొదటి ఇంటర్వ్యూ.

అప్పారావు పుస్తకంతెరిచి బట్టీ మొదలు పెట్టాడు.

వసీం విషయసేకరణలోకి దిగాడు.

పావుగంటలోనే తిరిగివచ్చాడు -

"గురూ! మన యిద్దరికీ సెలక్షన్‌ష్యూర్" అన్నాడు ఉషారుగా.

"ఎలా తెలిసింది వసీం...."

"మనమిద్దరమే డిప్లమా. ఉన్న పోస్టులు మూడు..."

"నిజంగానా...!!!" అప్పారావు కళ్ళు పెద్దవయాయి.

"ప్రామిస్! రహీం - అని - పర్సనల్ సెక్షన్‌లో ఉన్నారు. ఆయన స్వయంగా చెప్పాడు. పోతే - ఆఫీసర్ చాలా స్ట్రిక్టు. పార్సీ. రికమండేషన్ అంటే మండిపడతాడు. ప్యూర్లీ మెరిట్...."

అప్పారావు దిగాలుగా చూసాడు.

"నేనేమయినా చెప్పగలనా....? చాలా గాభరాగా వుంది...."

వసీం అతని చేయి నొక్కాడు.

"డోంట్ వర్రీ! అంతా మనమనుకున్నట్టే అవుతుంది! మీరు బాగా ఆన్సర్ చేస్తారు. నాకా నమ్మకం వుంది. చదువుతూండండి! మరో రౌండ్ వేసొస్తాను."

ఫారడేస్ లా, కిర్ఛీఫ్స్ లా బట్టీయం మొదలుపెట్టాడు అప్పారావు. అంతలోనే అతన్ని ఆలోచనలు దొలుస్తున్నాయి.

"నిజంగా మూడు పోస్టులా...."

ఒక్కటే పోస్ట్....అయితే....? వసీం గద్దలా తన్నుకుపోతాడు. రహీం - అంటున్నాడు. వాళ్ళకి వాళ్ళు చేసేసుకొంటారేమో! హిందువులకే ఒకరంటే ఒకరికి పడదు! ఒకడు ఒకడికి సాయంచేయడు!- చచ్చ! అలా జరగదు. ఆఫీసర్ పార్సీ. అంటే ఇంగ్లీమువాడా...? ఏమో! తురకతను మాత్రం అయుండడు! తనకు ఇంగ్లీషులో మాటలాడటం రాదు. ఎలా జవాబు చెప్తాడు....? ఆఫీసర్ తెలివయినవాడయితే కాండేటు ఇంగ్లీషు గూర్చి ఆలోచించడు. ఎలా పనిచేస్తాడో పసిగట్టాలి. అయినా ఏది ఎలా రాసిపెట్టి వుంటే అది అలాగే జరుగుతుంది. ఎంత ప్రాప్తమో అంతే!

అప్పారావుకి తండ్రి గుర్తువస్తున్నాడు.

చదువుకుంటాడు. ఆదుకుంటాడు - అనేగదా అష్టకష్టాలుపడి యింత

వరకూ తీసుకువచ్చాడు. చదువంటే - తన ప్రయత్నంలో వుందిగాని వుద్యోగం...?

అతను చదువుతున్నాడేగాని వసీం కదలికలు గమనిస్తూనే వున్నాడు

విద్యుత్ బోర్డులో పనికావడంవల్ల పబ్లిక్‌తో డీల్ చేయటం తెలిసిపోయినట్టుంది. వసీంకి - చకచకా మాటలు కలిపేస్తున్నాడు. ఎవరినో- వెంటబెట్టుకుని బయటకు వెళ్ళాడు.

అతను చదవకపోటం, ధీమా, చురుకుతనం - చూస్తుంటే అప్పారావుకి మరింత దిగులు పెరుగుతోంది.

ఇంటర్వ్యూలు మొదలయాయి.

అప్పారావు నాలుగో అభ్యర్థి.

ఈలోగా వసీమ్ వచ్చాడు. వేరేగా ఓ సోఫాలోకూర్చున్నాడు. అప్పారావు రమ్మన్నట్టు సైగచేసాడు. వసీమ్‌నించి రెస్పాన్స్ లేదు. తన చదువులో ఆలోచనల్లో ఉన్న అప్పారావుకి అతని వర్తన కొంతవింతగా అనిపించినా అంతగా పట్టలేదు.

అప్పారావు ఇంటర్వ్యూ మొదలయింది. దాదాపు ముప్పయి నిముషాలు జరిగింది. అతను అనుకున్నట్టే సబ్జక్టుమీదే నడిచింది. ముందు గాభరాపడినా ఆఫీసర్ ప్రోత్సహించాడు. అతను తనను ఫేవర్ చేస్తున్నాడని పించేసరికి అప్పారావు కాస్త నిబ్బరంగా ఆన్సర్ చేసాడు.

-మీ సెలక్షన్ విషయం వారం పదిరోజుల్లో తెలియబరుస్తాం" అన్నాడు ఆఫీసర్ అఖర్న.

అప్పారావే గొప్ప హోప్‌తో బయటకు వచ్చాడు.

వసీం అతన్ని సమీపించలేదు. అప్పారావు గబగబా అతనిదగ్గరచేరాడు.

"చాలా బాగా చేసాను వసీం!" అన్నాడు.

"ఊ...!"

"మీరూ బాగాచేయాలి. చేస్తారు...." ఉత్సాహంగా అన్నాడు.

లోపలికి వెళ్ళిన అభ్యర్థి వెంటనే వచ్చేసాడు. వసీంకి ముందు యిద్దరున్నారు. అప్పారావు తన ఇంటర్వ్యూ వివరాలు చెప్పబోయాడు.

"బండికి టయిమవుతుందేమో! తొందరగా బయల్దేరండి..." అన్నాడు వసీం చిరాగ్గానూ హఠాత్తుగానూ.

"బలేవారే! ఇద్దరం కలిసి వచ్చాం! కలిసేపోదాం!"

"లేదు లేదు!... నేను.... కొంచెం పనుంది! మా బషీర్‌సాబ్‌ని కలవాలి...." తడబడుతూ అన్నాడు.

అప్పారావు ఆశ్చర్యపోయాడు.

"అదేంటి? ఇద్దరం కలిసిపోదామనుకున్నాం....!!"

వసీమ్ అక్కడనించి లేచిపోయాడు.

అతనిలో మార్పు అప్పటికి అర్థమైంది. కారణం అందలేదు. అతన్ని వదిలేసి పోబుద్ధికాలేదు. ఇంటర్వ్యూకిముందు అతని దృష్టిని పాడుచెయ్యరాదని నిశ్చయించుకున్నాడు అప్పారావు.

అప్పారావు హాలుబయటకు వచ్చాడు. ఓ ప్యూన్ అతన్ని పలకరించాడు. పేరు నర్సింహుల్లు. ఆ తెలుగు అర్థమవటంలేదు అప్పారావుకి.

"ఒక్కటే ఖాళీయా...."

"గట్లపోతన్నడు... ఆ సాబ్‌కి పకడో సాబ్!"

అప్పారావు గుండె దడదడలాడింది. తనని ఎవరూ చూడటంలేదు. ప్యూన్ చూపించిన వ్యక్తి వెనకపడ్డాడు.

"నమస్కారం సార్!"

నల్లగా వెంకటేశ్వర విగ్రహంలావున్నాడామనిషి. నుదుటిమీద చాదు చుక్క. కిళ్ళీతో గారపట్టిన పళ్ళు. అతను అప్పారావుని నఖశిఖపర్యంతం ఓమారుచూసాడు కాంటీన్‌లోవున్న ఓ టేబిల్ ముందు కూర్చున్నాడు. జనం టిఫిన్‌ప్లేట్లు తెచ్చుకుంటున్నారు.

"ఇంటర్వ్యూకి వచ్చావా...?"

"అవున్సార్!"

"పేరేవిఁటి?"

"అప్పారావండి!"

"అప్పారా...వ్! అప్పారావ్! ఓ నీ పేరు అప్పారావుకదూ!... సరే! వెళ్ళి-దోసె ఓ పూరీ ఓ వడ తీసుకురా!"

అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చాడు అప్పారావు.

అతని చేతిలో పళ్ళాలు అందుకున్నాడు గుమస్తా.

"టీ తర్వాత తేవచ్చు! మంచినీళ్ళు...." వడప్లేటు పూర్తయాక అన్నాడు.

"ఏం చదివావు నువ్వూ....?"

"డిప్లమా.... సార్!"

"ఓ....నువ్వేనేంటి అప్పారావు... ఫర్లేదు! కూర్చో!"

పలకరించిన ఓ డాంగ్రీ కార్మికుడికి సమాధానం చెప్పి, మళ్ళీ అప్పారావువయిపు తిరిగాడు నోరు పెద్దగాచేసి పచ్చుడివేళ్ళని నాకేసి-

"లాభంలేదయ్యా! ఏవీఁ....లాభంలేదు"

"ఏంటి సార్..."

కాస్తముందుకువంగి - "అయిదొందలు ఏం?" కన్ను అదోలాకదుపుతూ అన్నాడు.

"వెంటనే అంటే.... యివ్వటం కష్టం సార్...మీరు ఆ! ఆ! రేపు సాయంకాలంలోగా.... అయితే...." గుసగుసలాడుతున్నట్టు అన్నాడు. ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకోబోతున్నట్టేవుంది అతనికి. ఆ కుర్రాడి కళ్ళలో తన జేబులోని ప్రేమరుమాలూ.....లీల.....ఆమె నాన్నగారూ కదిలారు.

"ఇంటర్వ్యూకి వస్తున్నప్పుడు... డబ్బులుతెచ్చుకోవాలనికూడా తెలీదా నీకు" కోపంగా అన్నట్టు అన్నాడు.

భయంగా చూసాడు అప్పారావు.

"ఏం చదివావు నువ్వు....?"

"డిప్లమా సార్!"

"ఏవిటి నీ పేరు...?"

"అప్పారావు సార్!"

"ఇదేనయ్యా! మనలో మనం చేసుకుందామన్నా... మనకి బతికే తెలివిలేదు! వెళ్ళి టీ పత్రా!"

టీ సిప్‌చేసి అన్నాడు

"ఒక్కటే పోస్ట్! తెలుసా...."

"తెలీదు సార్!"

"యిప్పుడు చెపుతున్నానుగదా...తెలుసుకో! మానేజ్ చేయిద్దామంటే నీదగ్గరేం లేదంటున్నావ్...సర్లే! ఇద్దరే క్వాలిఫైడ్ వాళ్ళున్నారు.... ఎవడో ఒకడిని తీసుకుంటాడులే!"

టీ గ్లాస్ వదిలి లేచాడు. ఇద్దరూ నడుస్తున్నారు.

"సార్! డబ్బులు తెచ్చుకుంటే నిజంగా పనవుతుందంటారా?"

అతను ఒక్కమారుగా ఆగి పెద్దగా అన్నాడు.

"వాడ్డూయూమీన్! ఎవడితో మాట్లాడుతున్నావో తెల్సా....?"

తెలియదనటానికి ధైర్యంచాల్లేదు అప్పారావుకి. జీవితంలో ఈ ఒక్కసాహసమో, తప్పో చేసేస్తేచాలు! బ్రతుకు సెటిలయిపోయినట్టే. యింక వెనక్కి చూడనక్కరలేదు. గొప్ప పట్టుదలగా వుంది.

"సార్! ఈ ఒక్కరోజు ఆగండి! రేపు...ఏదోలా ప్రయత్నిస్తాను"

అతను 'సర్లే' అన్నట్టు చూసి-

"రేపు చార్మినార్ క్రాస్‌రోడ్స్ దగ్గర రహామియా కాంటీన్‌లో ఆరుగంటలకి కలవు! అక్కడ కర్ఫ్యూ లేదులే!"

"అలాగేసార్ థాంక్యూసార్! థ్యాంక్యూ"

ఆఫీస్ గేట్ దగ్గర వదిలిన బాగ్ అందుకున్నాడు అప్పారావు. వసీం కూడా అక్కడే వున్నాడు.

కథా నిలయం
5349
శ్రీకాకుళం

కలసివచ్చిన వాళ్ళిద్దరూ విడివిడిగా బయటకు నడిచారు.

మూపుల మీద బరువులు.

మనసుల మీద ఆలోచనలు కరువులు.

కడుపుల్లో ఆకలి అరుపులు.

మధ్యాహ్నం ఒంటిగంట ఎండ ఇద్దర్నీ సమానంగా కాలుస్తోంది.

జీవితావసరం యిద్దర్నీ సమానంగా చీలుస్తోంది.

③

మెయిన్‌రోడ్ రెండుకిలోమీటర్లదూరంలో వుంది.

పది నిమిషాలసేపు చూసారు. ఆటోలేదు. రిక్షాలేదు. నిర్మానుష్యంగా పొడవుగా కన్పిస్తోంది సిమెంట్‌రోడ్. రోడ్‌కి అటూ ఇటూ చెట్లు లేవు. కొంచెం దూరంలో ఓ టీ దుకాణం వుంది.

వసీమ్ ముందు కదిలాడు.

అప్పారావు అనుసరించాడు.

ఇద్దరూ చెరోబల్లా ఆక్రమించారు. టీ! దుకాణంలో ముగ్గురే వున్నారు. అప్పారావుకి రొట్టె సహించలేదు.

బాగ్‌లోంచి పేపరుతీసాడు.

అందులో హత్యలు జరుగుతున్న వైనంవుంది. బేరాలకోసం నించున్న ఓ రిక్షా వాడిని పొడిచేసారు. అగరొత్తుల కోసం వచ్చిన ఓ పన్నెండేళ్ళ కుర్రాడిని పొడిచేసారు. పాలు అమ్ముకోడానికి వెళుతున్న ఓ ముసిలమ్మను పొడిచేశారు. స్కూటర్‌మీద ఇద్దరు వస్తున్నారు. ఒకడు డ్రైవ్‌చేస్తున్నాడు. మరొకడు కత్తిపట్టుకుంటున్నాడు. సెకన్లలో పనిపూర్తిచేసుకుని మాయమవుతున్నారు.

అకస్మాత్తుగా అప్పారావు బుర్రలోకి ఓ ఆలోచన జొరబడింది.

నిజంగా దేముడే వుంటే - ఆయనకి తనమీద దయే వుంటే - లీల నాన్నగారే తనకి డబ్బివ్వాలా....! ఈ వసీంని ఎవరయినా పొడిచెయ్యరాదూ!- తను ఒక్కడే క్వాలిఫైడ్ కాండేట్!

అదో మెరుపు! వెంటనే దాన్ని మెదడులోంచి నెట్టెయ్యటానికి ప్రయత్నించాడు అప్పారావు. అది అతనికి సాధ్యపడటంలేదు

లేపోతే తనలాంటి వాడికి ఉద్యోగం ఎలా వస్తుంది? ఈ దేశంలో తనలాంటి వాళ్ళు ఉద్యోగాలకోసం యిన్ని బాధలు పడటాన్కి కారణం ఏమిటి? వసీంలాంటి పైవాళ్ళు కాదా?-

జబ్బుపట్టిన ఆలోచనల మబ్బులు ఆ కుర్రవాడిని చుట్టుముడుతున్నాయి. సరయిన ఆలోచనలిచ్చే పెద్దరికమే కరువయినపుడు ఆవేశంలోని కుర్రకారు

ఎటుపోతుంది!

వసీంకూడా అలాంటి ఆలోచనలలోనే ఉన్నాడు.

ఉన్నదొకటే పోస్టు అని తెలిసాక అతనికీ అప్పారావు మీద శత్రుభావన మొదలయింది. ఇంటికిపోతాను మొర్రో-అంటున్న వాడిని ఎందుకు ఆపానా అన్న చికాకు, పశ్చాత్తాపం. అతనిలో.

నిర్మానుష్యమయిన రోడ్లు... పేపర్లలో వార్తలు... అతని మెదడులోకూడా అప్పారావుకి ఏదయినా జరిగితే బాగుండునన్న ఊహను కల్గిస్తున్నాయి. తన సెలక్షన్‌కి ఢోకా వుండదుగదా అనిపిస్తోంది.

ఆ పంథొమ్మిదివరవయ్యేళ్ళ లేత మనసులమీద ఆ ఆలోచనలు ముసురు కుంటున్నాయేకాని అవి గాఢంగాలేవు.

అలాంటి ఆలోచనలు వస్తున్నందుకు - ముక్కూ మొహం తెలీని మనుషులపట్ల అకారణవైరభావనకూ - ఏదో మారుమూల దుఃఖం.

తొందరగా ఏ ఆటోయో దొరికితే బాగుండును! స్టేషన్‌కి చేరుకొంటే ఈ పరిస్థితి నుంచి.... ఈ ఆలోచన్ల నుంచి.... దూరంగా.

దుకాణంలోంచి బయటకువచ్చారు.

వేగంగా నడుస్తున్నారు. అలుపువస్తోంది. ఎండ కసిగా కాస్తోంది.

దూరంగా చుక్కలా కనిపిస్తూంది. శబ్దం వినిపిస్తోంది. దూరంనుంచి. స్కూటరో మోటార్ సైకిలో తెలీటంలేదు. ఎదరగా వస్తోంది.

ఇద్దరి గుండెలూ వేగంగా కొట్టుకొంటున్నాయి.

స్కూటరే! అది... మృత్యు వాహనం కాదుగదా...!!!

శరీరాలమీద వెంట్రుకలు నిక్కబొడుచుకుంటున్నాయి. అదిహింధువుల స్కూటరా? ముస్లిములదా?

ఇద్దరు ఉన్నారు.

చాలా వేగంగా.... వేగంగా...సమీపంగా.....

దూసుకుని వస్తోంది.

చెవులు బద్దలు చేస్తున్నట్టుంది శబ్దం.

కట్టేసినట్టయిపోయాయి కాళ్ళు. పరిగెత్తాలన్న ఆలోచనకూడా పరుగెత్తుకురాట లేదు.

మరింత దగ్గరగా....

హారన్ బయ్యిమంటూ దూసుకుపోయింది.

భయంతో మూతబడ్డ కళ్ళు విడాయి. ఇద్దరూ రోడ్డుకి ఓ వేపు వున్నారు. చాలా దగ్గరగా వున్నారు.

అది మృత్యువాహనం కాదు. మామూలు స్కూటర్!

భయం తొలగిపోయింది.

ఇద్దరూ ఒకరివెనక ఒకరు నడుస్తున్నారు. తమ మలినభావాలు ఎదుటివాళ్ళకు తెలిసిపోయాయా అన్న కించ. ఎలా పలకరించుకోటం?

వెనకనుంచి వాళ్ళ ఆలోచనలు చీల్చుకుంటూ మోటార్ సైకిల్ శబ్దం. అప్పారావు హఠాత్తుగా వెనక్కితిరిగాడు.

ఒక్క అంగ దూరంలో తలవంచుకుని ఏ ఆలోచనలోనో మునిగివున్న వసీం.

అతనికి నాలుగు గజాల దూరంలో జావాబండి!

ఎండకాంతిలో వెనకసీటు చేతిలో తళతళ మెరుస్తున్న కత్తి....

నాలుగు గజాల దూరం లిప్తపాటులో మాయం!

"వసీమ్!" బిగ్గరగా అరుస్తూ అప్పారావు అతన్ని చుట్టేసి పక్కకి లాగెయ్యబోయాడు.

వీపుకి గురిచూసిన ఆయుధం మోచేతిని గీసుకుంటూపోయింది. మోటర్ సైకిల్ దూసుకుంటూపోయింది.

పచ్చటి లేత చెయ్యిమీద ఎర్రటి గీత! ఒక్కమారుగా రక్తం! రక్తం! అప్పారావు చేతిమీదుగా....

అప్పారావు గుండెల్లోని మలిన భావాలను కడిగేస్తూ.... కళ్ళల్లో కన్నీటిని బయటకి రప్పిస్తూ....

బాధ భరించటానికి వసీం చేస్తున్న ప్రయత్నానికి గుర్తుగా అడుగుపెదవి పళ్ళకింద గిలగిల తన్నుకొంటోంది.

సూర్యుడి కిరణాలకు ఎరుపు పులుముతున్న మానవరక్తం!

మంచి మార్పుకోసం పోరాడాల్సిన రక్తం.....

అప్పారావు తన ప్రేమ నిండిన జేబు రుమాలుతో బలంగా కట్టుకట్టాడు.

మనిషి మనిషి కోసం కార్చే కన్నీరు ఇద్దరి కళ్ళల్లో.

వసీం బాధతో గిలిగిలలాడుతున్నాడు.

"కొంచెం ఓర్చుకో వసీం....! మనం రోడ్డుకు చేరుకుంటే ఏదో ఒకటి దొరుకుతుంది. హాస్పిటల్‌కి పోదాం....!"

యిద్దరూ నడుస్తున్నారు. బరువంతా అప్పారావు మీద వేసాడు వసీం.

హఠాత్తుగా అన్నాడు అప్పారావు.

"వాళ్ళెవరంటావ్....?"

వసీం బలవంతంగా నవ్వబోయాడు.

చంపబోయినదెవరు? హిందువా? ముస్లిమా....?

చంపబోయిందెవరిని? హిందువునా? ముస్లిమ్‌నా?

హిందువూ కాదు? ముస్లిమూ కాదు! చంపబోయినది ఓ మనిషి! చంపబోయినది ఓ మనిషిని.

అతనికి కావల్సినది ఓ మనిషి చావు! ఆ హతుడు ఓ హిందూ అయితే లక్షమంది హిందువుల హృదయాలు భగ్గుమనటం! అదే ఓ ముస్లిం అయితే లక్షమంది ముస్లింల మనసులు విషపూరితమవటం! రెండులక్షల చేతులు కత్తులు దూయటం! ఒకరినొకరు నరుక్కోవటం! తమ సామూహిక అవసరాలను మరిచిపోవటం! ఆ అవసరాలు తీరుస్తామన్న వాగ్దానాల ముసుగులో తమ వ్యాపారాలు కొందరు సజావుగా సాగించుకోగలగటం!

వసీం బలవంతపు నవ్వులో ఈ ఎరుక అంతా లేదు.

వాళ్ళిద్దరిలోనూ ఆ ఎరుకకి అవసరమయిన స్నేహపు నెలవంక పొడిచింది. దాంతో వాళ్ళ చేతుల్లో కత్తులు చేరే అవకాశం సన్నగిల్లింది.

"భాయీ! నన్ను మన్నించు..."

"వసీం నన్ను క్షమించు...."

ఎందుకన్న ప్రశ్న వాళ్ళు వేసుకోలేదు. నగరం వాళ్ళకి దగ్గరవుతోంది.

(ఇందులోని సంఘటనల్లో వ్యక్తుల్లో పరిసరాల్లో ఎవరికయినా ఏ పోలికలయినా కన్పించితే అది కేవలం యాదృచ్ఛికంగానూ.... మరెవరికయినా ఏ పోలికలూ కనిపించకపోతే ఇదంతా కేవలం కల్పనగానూ.... గమనించప్రార్థన....)

('స్వాతి' మాసపత్రిక - ఫిబ్రవరి, *1984)*